# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

గురువారం 13, నవంబర్ 2025


## ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

◆ రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

**నస్పూర్, నవంబర్ 12, ప్రభాతవార్త**

ప్రజలు అందించే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి, భరోసా కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పోలీస్ అధికారులకు సూచించారు. బుధవారం వార్షిక తనిఖీల్లో భాగంగా మంచిర్యాల జోన్‌లోని సిసిసి నస్పూర్ పోలీస్ స్టేషన్‌ను రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా తనిఖీ చేశారు. తనిఖీలకై పోలీస్ స్టేషన్ చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు పోలీస్ అధికారులు పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.




ఈ సందర్భంగా రామగుండం సీపీ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు నివారణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, రోడ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని, అన్ని శాఖల సమన్వయంతో బ్లాక్ స్పాట్‌లు గుర్తించి, ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం పోలీస్ కమిషనర్ సిబ్బందితో మాట్లాడి వారి విధులు, పనితీరు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్ రిసెప్షన్, మిగతా 2లో..

ఆన్‌లైన్ మోసం కేసులో

## మూడో నిందితుడి అరెస్ట్

**ఆసిఫాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త**

ఆన్లైన్ మోసం చేసిన కేసులో మూడో నిందితుడిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 4న టెలిగ్రామ్ లింక్ ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించి బ్యాంక్ ఖాతా నుండి రూ.1,66,267 మోసం చేశాడని ఆసిఫాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ లో వచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా వారు గుజరాత్ రాష్ట్రానికి చెందిన పంకజ్, శైలేష్ లుగా గుర్తించిన్నట్లు తెలిపారు. ఈ నిందితులను అరెస్ట్ చేసి ఆసిఫాబాద్‌కు తరలించి రిమాండ్ చేసినట్లు వివరించారు. తదుపరి విచారణలో శైలేష్ ఇచ్చిన సమాచారంతో మూడో నిందితుడు మిథుల్ ను పట్టుకుని స్థానిక కోర్టులో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్ పొంది ఆసిఫాబాద్‌కు తీసుకోచ్చామన్నారు. బాధితుడి బ్యాంక్ ఖాతా నుండి మోసపోయిన మొత్తంలో రూ.60,582 హోల్డ్ చేయించబడ్డాయని, మోసపోయిన డబ్బులు ఎవరి ఖాతాల్లో జమయ్యాయో గుర్తించిన్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సోషల్ మీడియా, వాట్సాప్ లింకులు ద్వారా వచ్చే ఆఫర్లను నమ్మి క్లిక్ చేయకూడదని, సైబర్ మోసాలు ఎదురైన వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్ లో ఫిర్యాదు చేయాలని మిగతా 2లో..




విద్యార్థుల ఉత్తమ భవిష్యత్ నిర్మాణానికి

## విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం

రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**జైపూర్, నవంబర్ 12, ప్రభాతవార్త**



విద్యార్థుల ఉత్తమ భవిష్యత్ నిర్మాణానికి రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జైపూర్ మండల కేంద్రంలో కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల గదులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి వివేకానంద మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేసి సకల సౌకర్యాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులు ఏకాగ్రతతో విద్య అభ్యసించి ఉన్నత స్థాయిలో రాణించాలని తెలిపారు. విద్య ఎంతో శక్తివంతమైనదని, క్రమశిక్షణతో చదువుకుంటే భవిష్యత్తు బంగారు మయమవుతుందని తెలిపారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరై చదువుకోవడమే కాకుండా తమ తల్లిదండ్రులకు సహాయంగా నిలవాలని అన్నారు. విద్యతోపాటు క్రీడారంగంలో రాణించాలని. సాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని, తద్వారా ఆత్మవిశ్వాసం కలుగుతుందని, క్రమశిక్షణతో మంచి నైపుణ్యం పొందాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం 51 వేల మంది ఉపాధ్యాయులను నియమించిందని తెలిపారు. పాఠశాలలలో అవసరమైన ఫర్నిచర్, ఉపాధ్యాయులనియామకం, మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పిస్తుందని తెలిపారు. 2.5 కోట్ల రూపాయల సిఎస్ఆర్ నిధులతో అదనపు గదులు నిర్మించడం జరిగిందని, రామకృష్ణాపూర్‌లోని గురుకుల పాఠశాలలో 30 లక్షల రూపాయల మిగతా 2లో..

## ప్రభుత్వం అందించే ప్రతి పైసా ప్రజా ప్రయోజనార్థం వినియోగించాలి

* రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య

**నిర్మల్ పట్టణం, నవంబర్ 12, ప్రభాతవార్త**

స్థానిక సంస్థలు ఆర్థికంగా బలోపేతం కావడం ద్వారానే గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య అన్నారు. ఆదిలాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం కమిషన్ చైర్మన్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో కమిషన్ సభ్యులు రమేష్, కార్యదర్శి కాత్యాయిని దేవి, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, స్థానిక సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధి మిగతా 5లో..






## లక్షెట్టిపేటలో అటవీ శాఖ - పోడు రైతుల మధ్య ఉద్రిక్తత

**లక్షెట్టిపేట, నవంబర్ 12, ప్రభాతవార్త**

లక్షెట్టిపేటలో అటవీ శాఖ – పోడు రైతుల సమస్య మరలా ఉద్రిక్తతకు దారి తీసింది. అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆదివాసీ పోడు రైతులు ఆందోళనకు దిగారు. తమ భూముల గురించి వినతిపత్రం అందజేయడానికి వచ్చిన దమ్మన్నపేట గ్రామానికి చెందిన పోడు రైతులను అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకోవడానికి ప్రయత్నించడంతో పరిస్థితి వేడెక్కింది. రణరంగంగా మారిన పట్టణం పరిసరాలు ఉత్కూర్ చౌరస్తా వద్ద గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దమ్మన్నపేటకు చెందిన పోడు మిగతా 2లో..

## కొట్టుకున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తలు

కళ్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీలో ప్రోటోకాల్ రగడ

**బోథ్, నవంబర్ 12 ప్రభాతవార్త:**

ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో బుధవారం జరిగిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ రసాభాసగా మారింది. కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తలు కొట్టుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమన్ని అధికారులు ఏర్పాటు మిగతా 2లో..



### విద్యార్థుల ఉత్తమ భవిష్యత్ నిర్మాణానికి

# విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

ఎస్‌డిఎఫ్ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు 15 రోజులలో ప్రతిపాదనలు అందించాలని, విద్యార్థులకు చదువుకునేందుకు మంచి వాతావరణం కల్పించాలని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకుని వాటిని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులు తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యలో అభివృద్ధి చెందేలా కృషి చేయాలని తెలిపారు. కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య, విద్యా రంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు అవసరమైన త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ, విద్యార్థినీ విద్యార్థులకు వేరువేరుగా మూత్రశాలలు ఇతర సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. 2.5 కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన జూనియర్ కళాశాల అదనపు గదులలో తరగతి గదులు, పరిపాలనా విభాగం, ల్యాబ్ ఇతర సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థుల సంఖ్య 3 శాతం పెరిగిందని, ఈ విద్యా సంవత్సరంలో 6 వేల నుండి 7 వేల మంది విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల నుండి ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు.



భీమారం మండల కేంద్రంలో ఆశ్రమ పాఠశాల అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని, కోటపల్లి మండలంలోని ఆశ్రమ పాఠశాలలో పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. భీమారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, చెన్నూర్ బాలికల ఆశ్రమ పాఠశాల లలో పనులు జరుగుతున్నాయని, జైపూర్‌లోని ఎస్సి సంక్షేమ వసతి గృహం కొరకు సి.ఎస్.ఆర్. నిధులు మంజూరయ్యాయని తెలిపారు. జిల్లాలో చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల పనులు పురోగతిలో ఉన్నాయని, త్వరగా పూర్తి చేసే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వారి పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి రోజు వారు పాఠశాలకు హాజరయ్యేలా పర్యవేక్షించాలని తెలిపారు. జిల్లాలోని కస్తూరిబా బాలికల విద్యాలయంలో విద్య అభ్యసించి ఎంబిబిఎస్ సీటు సాధించడం అభినందనీయమని, ఈ విషయాన్ని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకొని చదువులో రాణించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలలో చదువుకునేందుకు ప్రతి ఒక్కరికి అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం 41 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి/షాది ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారి యాదయ్య, ఎస్ఈటిజీడబ్ల్యుఐడిసి రవీందర్ రావు, తహాశీల్దార్ వనజ రెడ్డి, ఎంపిడిఓ సత్యనారాయణ, ఎంఈఓ శ్రీనివాస్, జీసీడీఓ విజయలక్ష్మి, స్పెషల్ ఆఫీసర్ పణిబాల తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి

(మొదటిపేజీ తరువాయి)

సిసిటిఎన్ఎస్ విభాగాల పనితీరును సంబంధిత పోలీస్ సిబ్బందిని శాఖపరమైన సమస్యలను సీపీ అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ సంబంధించిన పలు రికార్డులను తనిఖీ చేయడంతో పాటు పెండింగ్ కేసులు, కోర్టు కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో ఉన్న కేసులకు సంబంధించి క్షుణ్ణంగా తనిఖీ చేసి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. స్టేషన్ పరిధిలో జరిగే నేరాలు, సమస్యలు, ప్రజల జీవన విధానం, స్థానిక పరిస్థితులు, ముఖ్యమైన ప్రాజెక్ట్‌ల గురించి అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్లు, అనుమానితులు, కేడీ, డిసిలు, మిస్సింగ్, ప్రాపర్టీ నేరాలకు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ నిర్వహించాలని గ్రామాలు, కాలనీలను సందర్శించి ప్రజలతో మమేకమై ప్రజలలో నమ్మకాన్ని కలిగించడంతో పాటు, పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పెంపొందించాలి. ప్రజల సమస్యలకు తక్షణ స్పందనతో పాటు, మర్యాదపూర్వకంగా వారి సమస్య వినాల్సిన బాధ్యత ఉందని అన్నారు. ఈ నెల 15న జరిగే లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన కేసులు రాజీ పడేవిధంగా ఇరువర్గాల వారితో మాట్లాడి రాజీ మార్గం రాజ మార్గమని సూచించాలని తెలిపారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ తనిఖీల్లో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, ఏసీపీ ప్రకాష్, మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ ఉపేందర్ రావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# లక్షెట్టిపేటలో అటవీ శాఖ - పోడు రైతుల మధ్య ఉద్రిక్తత

(మొదటిపేజీ తరువాయి)

రైతులను అరెస్ట్ చేయడానికి విఫలయత్నం చేసిన అటవీశాఖ సిబ్బందిని అడ్డుకునేందుకు ఆదివాసీ మహిళలు ముందుకు వచ్చారు. భూములు మా హక్కు - సాగు మా జీవనాధారం అంటూ నినాదాలతో ఆవేశం వ్యక్తం చేశారు. రైతులపై అధికారుల కఠిన చర్యలను ప్రజలు ఖండిస్తున్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం మాకు సాగువే హక్కు అంటూ పోడు రైతులు పట్టుదలతో ఉన్నారు. ఇక తమ సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సిఐడి రమణమూర్తి, ఎస్సై గోపతి సురేష్ ఆధ్వర్యంలో వారిని సముదాయించి సమస్యను పరిష్కరించారు.

### ఆన్‌లైన్ మోసం కేసులో

# మూడో నిందితుడి అరెస్ట్

(మొదటిపేజీ తరువాయి)

లేనిపక్షంలో సమీప పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని సూచించారు. ఆన్లైన్ మోసం చేసిన కేసులో నిందితులను అరెస్టు చేయడానికి కృషి చేసిన ఆసిఫాబాద్ పోలీస్ స్టేషన్ టౌన్ సీఐ, డిఫోర్సి బృందం, పోలీస్ స్టేషన్ సిబ్బందికి జిల్లా ఎస్పీ అభినందనలు తెలిపారు.

# కొట్టుకున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ కార్యకర్తలు

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతున్న క్రమంలో వేదిక పైన పలువురు బిఆర్ఎస్ నాయకులు ఉండడంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు ప్రోటోకాల్ అంశాన్ని లేవనెత్తారు. దీంతో ఇరు పార్టీల నేతలు ఒకరినొకరు దుమ్మెత్తి పోసుకున్నారు. అనంతరం తోపులాట జరిగి ఒకరినొకరు నెట్టుకోవడంతో పాటు పిడి గుద్దులు గుద్దుకోవడం జరిగింది. పరిస్థితిని గమనించిన పోలీసులు ఇరు పార్టీల నేతలను సముదాయించి గొడవ సద్దుమణిగేలా చేశారు. అనంతరం ఇరు పార్టీల నేతలు ఎంతకు తగ్గలేదు. తదనంతరము ఎమ్మెల్యేకు వ్యతిరేకంగా కాంగ్రెస్ నాయకులు ధర్నా నిర్వహించి అక్కడే నినాదాలు చేశారు. ఇరు పార్టీల నేతల గోడవలతో అక్కడికి వచ్చిన లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు తలలు పట్టుకున్నారు. రెండు పార్టీలైన బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నేతలు ఇరువురి నాయకులపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేసుకున్నారు.





లబ్ధిదారులకు వ్యవసాయ పరికరాలు అందజేస్తున్న టెక్నికల్ ఆఫీసర్

# ప్రధానమంత్రి కృషి సంచార యోజన 2.0 పథకం ద్వారా రైతులకు వ్యవసాయ పరికరాల పంపిణీ

**లింగాపూర్, నవంబర్ 12, ప్రభాతవార్త:**

మండలంలో జాముల్ ధర, వంకమద్ది గ్రామపంచాయతీ, రైతులకు ప్రధానమంత్రి కృషి సంచర యోజన పథకం ద్వారా లబ్ధిదారులకు వ్యవసాయ పరికరాలు, పైపులు, ఇస్ప్రింక్లర్స్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి కృషి సంచర యోజన పథకం టెక్నికల్ ఆఫీసర్ షేక్ హైమద్. మాట్లాడుతు వంకమది, చోర్పల్లి, మోడీగూడ, ఎలాపాటర్, లింగాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని రైతులు వ్యవసాయానికి ఉపయోగపడే పరికరాలు 25శాతం రైతులు చెల్లిస్తే 75శాతం సబ్సిడీ ద్వారా రైతులకు పరికరాలు ఇవ్వడం జరుగుతుంది. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్క రైతు ఉపయోగించాలని తెల్పడం జరిగింది. లబ్ధిదారులు పొందిన వ్యవసాయ పరికరాలను ఉపయోగించి వ్యవసాయాన్ని లాభసాటిగా అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, వాటర్ షెడ్ కమిటీ మెంబర్స్, జగ్నాక రాము, కినక మాణిక్రావ్, సలాం రాము, జాదవ్ తిరుపతి, తాజా మాజీ మండల అధ్యక్షులు సావిత ప్రేమ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

# తిర్యాని ఎంపీవోగా ప్రశాంత్

**తిర్యాని, నవంబర్ 12, ప్రభాతవార్త :**

తిర్యాని మండల పంచాయతీ అధికారిగా బుధవారం ప్రశాంత్ పదవి బాధ్యతలు స్వీకరించినట్లు తిర్యాని మండల పరిషత్ అభివృద్ధి అధికారి వేముల మల్లేష్ తెలిపారు. కాగా గత కొంతకాలం నుండి ఎంపీవో పోస్టు ఖాళీగా ఉంటూ వస్తుండడంతో ఎంపీడీవోనే ఇంచార్జి ఎంపీవో గా కొనసాగుతూ వచ్చారు. ఎంపీఓగా ప్రశాంత్ పదవి బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ మండల పంచాయతీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, ఆయా పంచాయతీ కార్యదర్శులు, ప్రజలందరూ సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు, పాల్గొన్నారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంపీవో

# బియ్యం, సరుకులు పంపిణి

**దహెగాం, నవంబర్ 12, ప్రభాతవార్త :**

దహెగాం మండలం పెసరికుంట గ్రామంలోని వర్షాకాలంలో వరద ప్రభావితం అయిన పది కుటుంబాలకు బియ్యం పంపిణి చేయడం జరిగింది. పెసరికుంట గ్రామంలోని పది కుటుంబాలు పెద్దవాగు ఒడ్డున ఉండడంతో వరద ప్రభావానికి గురైనాయి. ఇరు కుటుంబాలు కుమురం భీం జిల్లా కలెక్టర్ కు విన్నవించగా ప్రభుత్వానికి నివేదిక పంపించగా దహెగాం తహసీల్దార్ ఆధ్వర్యంలో బుధవారం నాడు పెసరికుంట గ్రామంలోని వరద బాధిత కుటుంబాలకు బియ్యం, సరుకులు పంపిణి చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో జిపివో బానేష్ గ్రామస్థులు నాయికిని సదయ్య, మాస్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.



సరుకులు పంపిణి చేస్తున్న జిపివో, గ్రామపెద్దలు

# గిరిజన విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలి

## ఎంపి గొడం నగేష్



క్రీడలను ప్రారంభిస్తున్న ఎంపి, ఎమ్మెల్యే, కలెక్టర్

**ఉట్నూర్, నవంబర్ 12, ప్రభాతవార్త:**

గిరిజన విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలని ఆదిలాబాద్ ఎంపి గొడం నగేష్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురం భీం క్రీడా ప్రాంగణంలో గిరిజన విద్యార్థులకు నిర్వహించిన జోనల్ స్థాయి క్రీడా పోటీలను సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపి గొడం నగేష్ మాట్లాడుతూ జోనల్ స్థాయి క్రీడా పోటీలలో పాల్గొంటున్న క్రీడాకారులు క్రమశిక్షణతో పోటీలలో పాల్గొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని తెలిపారు. గెలుపు, ఓటములను సమానంగా పంచుకోవాలని, చదువుతో పాటు క్రీడారంగంలో రాణించి ఈ ప్రాంతానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేస్తూ అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసి సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని అన్నారు. క్రీడల ద్వారా మానసిక ఉల్లాసం, శారీరక ఆరోగ్యం లభిస్తాయని, స్నేహభావం పెంపొందుతుందని, నాయకత్వ లక్షణాలు అలవాడతాయని తెలిపారు. సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్ మాట్లాడుతూ ఉట్నూర్ కేంద్రంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలలో క్రీడాకారులకు పూర్తి స్థాయిలో వసతి కల్పించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, క్రీడా పోటీలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు మట్టిలో మాణిక్యాలు అని, క్రీడా నైపుణ్యంతో పాటు చదువులో ఎంతోమంది గిరిజన విద్యార్థులు రాణిస్తున్నారని తెలిపారు. జోనల్ స్థాయిలో విద్యార్థులు రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. ఆశ్రమ పాఠశాలలలో చదివే విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తున్నారని, ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా రాణిస్తున్నారని తెలిపారు. అనంతరం విద్యార్థులు నృత్యలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు, దుప్పట్లు అందజేస్తున్న దృశ్యం

# చలి తీవ్రత దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి

## అమ్మ ట్రస్ట్ వ్యవస్థాపకులు బొడ్డు కిరణ్

**ఉట్నూర్, నవంబర్ 12, ప్రభాతవార్త:**

చలి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా ప్రజలు జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని అమ్మ ట్రస్ట్ వ్యవస్థాపకులు బొడ్డు కిరణ్ కోరారు. బుధవారం అమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉట్నూర్ పట్టణంలో ఉట్నూర్ తహసీల్దార్ చేతుల మీదుగా చిన్నారులకు, పెద్దవారికి దుప్పట్ల పంపిణీతో పాటు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ చలి తీవ్రత వలన ముఖ్యంగా చిన్న పిల్లలను చాలా జాగ్రత్తగా చూసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు. అమ్మ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ దుప్పట్ల పంపిణీ కార్యక్రమం చాలా మంచి కార్యక్రమం అని ఇలాంటి కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని సూచిస్తూ బొడ్డు కిరణ్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో చందు, సన గోపి, పృథ్వీ, ధరణి రాజేష్,బొడ్డు నరేష్, సిద్ధం నవీన్, హరి, మరికంటి నారాయణ, సాధని సంతోష్, సూర్య కిరణ్, మల్లికార్జున్, దినేష్, మరికంటి కిరణ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# లైంగిక దాడి కేసులో ఇద్దరికీ 20 ఏళ్ల కారగార శిక్ష


**ఖానాపూర్, నవంబర్ 12, ప్రభాతవార్త:**

లైంగిక దాడి కేసులో ఇద్దరికి ఇరువై ఏళ్ల కారాగార శిక్షతోపాటు పదివేల రూపాయల జరిమానాను నిర్మల్ జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి ఎస్ శ్రీవాణి బుధవారం నిర్మల్ జిల్లా కోర్టులో తీర్పును వెలువడించినట్లు నిర్మల్ జిల్లా ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల తెలిపారు. ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్ జిల్లా ఖానాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల పాత ఎల్లాపూర్ గ్రామానికి చెందిన ఒక వివాహిత మహిళపై భర్త స్నేహితులు ఇద్దరూ 2017 సంవత్సరంలో స్నేహితుని భార్యను అపహరించి లైంగిక దాడికి పాల్పడగా బాధితురాలి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ అశోక్ కేసును విచారించి చార్జి షీట్‌ను కోర్టుకు సమర్పించగా అప్పటినుండి ఇప్పటివరకు కేసు జిల్లా కోర్టులో కొనసాగుతుంది. బాధితురాలు పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి పూర్తి ఆధారాలతో నిరూపించి బలమైన వాదనలు వినిపించడంతో పిపి వినోద్‌రావు వాదనలను పరిగణంలోకి తీసుకున్న జిల్లా న్యాయమూర్తి నేరస్తులైన దండుగుల ధర్మపురి, కుంచపు గంగాధర్‌లకు ఇద్దరికీ 20 సంవత్సరాల శిక్షతోపాటు ఒక్కొక్కరికి 5000 చొప్పున మొత్తం పదివేల రూపాయలు జరిమానా విధిస్తూ జిల్లా న్యాయమూర్తి ఎస్ శ్రీవాణి తీర్పును వెలువడించినట్లు ఎస్పీ డాక్టర్ జానకి షర్మిల పేర్కొన్నారు. నిందితులకు శిక్ష పడే విధంగా బలమైన వాదనలు వినిపించిన పిపి వినోద్ రావును జిల్లా ఎస్పీ జానకి షర్మిల అభినందించారు.

# 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

**ఖానాపూర్, నవంబర్ 12, ప్రభాతవార్త:**

ఈ నెలలోపు 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ విజయలక్ష్మి అధికారులకు సూచించారు. ఖానాపూర్ మండల సమాఖ్య కార్యాలయాన్ని బుధవారం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ విజయలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బందితో సమావేశం నిర్వహించి బ్యాంకు లింకేజీ, రికవరీ కార్యక్రమాలపై సమీక్ష చేపట్టారు. సిసి వారిగా వారి పనితీరును అడిగి తెలుసుకున్న విజయలక్ష్మి, ఈ నెలలోపు 100 శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. బ్యాంకు లింకేజీ ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు రికవరీ అంశంలో ప్రతి సిబ్బంది సమిష్టిగా పనిచేయాలని సూచనలు ఇచ్చారు. సమీక్షా సమావేశంలో ఏపీఎం మల్లేష్, సీసీలు తునికి రాజేందర్, శ్రీనివాస్ రావు, శ్యామల రతిలాల్, అకౌంటెంట్ నరేందర్, కంప్యూటర్ ఆపరేటర్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఉల్లాస్ ఉద్దేశం నిరక్షరాస్యత నిర్మూలన

**సారంగాపూర్, నవంబర్ 11, ప్రభాతవార్త:**

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ (నవభారత సాక్షరత కార్యక్రమం) ముఖ్య ఉద్దేవం నిరక్షరాస్యతను నిర్మూలించడమని ఎంఈఓ మహేందర్ అన్నారు. గ్రామ స్థాయిలో ఐకేపీ సిబ్బంది విఓలఆధ్వర్యంలో నిర్వహించిన నిరక్షరాస్యుల సర్వే నివేదికను బుధవారం ఎంఈఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మహేందర్ మాట్లాడుతూ మండల స్థాయిలో 1577 మంది నిరక్షరాస్యులను గుర్తించినట్లు తెలిపారు. వీరికి 10మంది సభ్యులకు ఒక గ్రూప్‌గా తయారు చేసి, ప్రతీ గ్రూపుకు ఒక స్వచ్ఛందంగా విద్య నేర్పే వాలంటీరులను నియమించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరు లాభాపేక్ష లేకుండ భోదిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని నిరక్షరాస్యులు ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం సునంద తదితరులు పాల్గొన్నారు.

# రేపు జిల్లాలో సర్దార్ 150వ పాదయాత్ర

## నోడల్ అధికారి రమాదేవి

**ఆసిఫాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త :**

ఈ నెల 14న సర్దార్ 150వ పాదయాత్ర కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నోడల్ అధికారి రమాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనం నుండి పాదయాత్ర ప్రారంభమై కొమురం భీం విగ్రహం మీదుగా తిరిగి కలెక్టరేట్ కు చేరుకుంటుందన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ కు నివాళులు అర్పించడం, జాతీయ పతాకావిష్కరణ, దేశభక్తి గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు, ధ్రువపత్రాల పంపిణీ వంటి కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వహించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు.

# నేడు హంపి పీఠాధిపతి రాక

**సారంగాపూర్, నవంబర్ 12, ప్రభాతవార్త:**



మండలంలోని అడెల్లి మహాపోచమ్మ నూతన ఆలయం నిర్మాణం పూర్తియై, విగ్రహ పున:ప్రతిష్టపాన కార్యక్రమం ముగిసిన అనంతరం హంపి పీఠాధిపతి శ్రీ విరుపాక్ష విద్యారణ్య భారతి స్వామి ఈ నెల 13న ఉదయం 11.00 గంటలకు అమ్మవారి దర్శింకోవడానికి రావడం జరుగుతుందని ఆలయ కమిటి చైర్మన్ సింగం భోజగౌడ్ తెలిపారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఐఈఓ

# చక్కగా చదివి ర్యాంకులు తెచ్చుకోవాలి

**ఉట్నూర్, నవంబర్ 12, ప్రభాతవార్త:**

ప్రతి ఒక్కరు చక్కగా చదివి ర్యాంకులు తెచ్చుకోవాలని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాధికారి జాదవ్ గణేష్ కుమార్ అన్నారు. బుధవారం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉట్నూర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతోనే ముందు భవిష్యత్ ఉందని, ప్రతి ఒక్కరు కష్టంతో కాకుండా ఇష్టంగానే చదువుకొని కళాశాల పేరుతో పాటు తల్లీ తండ్రుల పేరు కూడా తెచ్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులను సిలబస్, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకోని అధ్యాపకులకు సలహా, సూచనలు ఇచ్చారు. విద్యార్థుల హాజరు శాతంను పరిశీలించరు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సువర్ణ, శ్రీలత, గణేష్, వినోద్, లక్ష్మణ్, తిరుపతి, దత్తు, అశ్విన్ చౌహన్, నీలోఫర్, రానా, సుధాకర్, విష్ణు, మల్లేష్, సాయి కృష్ణ, విద్యార్థులు ఉన్నారు.

# వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభం

**నర్సాపూర్(జి), నవంబర్ 12, ప్రభాతవార్త:**



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ భీమ్‌రెడ్డి

నర్సాపూర్(జి) మండల కేంద్రంలో బుధవారం డీఆర్‌డీఏ-ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా భీమ్ రెడ్డి మాట్లాడుతూ రైతుల నుండి వరి కొనుగోలు సాఫీగా సాగేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం రైతులకు సరైన మద్దతు ధర అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ పుష్పలత, బీజేపీ మండల అధ్యక్షుడు బర్కుంట నరేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇంద్రకరణ్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ రామయ్య, సర్పంచ్ రాంరెడ్డి, ఏపీఎం గంగామణి, దత్తురాం, ఉమామహేశ్వర్, మహేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

## మండల పంచాయతీ అధికారిగా వెంకటేష్

**వేమనపల్లి, నవంబర్ 12, ప్రభాతవార్త**


బాధ్యతలు స్వీకరించిన ఎంపీఓ

వేమనపల్లి మండల పంచాయతీ అధికారిగా పి. వెంకటేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన శ్రీనివాస్ కన్నెపల్లి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా మండల కార్యాలయంలో ఎంపీడీవో కుమారస్వామి, ఏపీఓ మహేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఆయనకు శాలువా కప్పి సన్మానించారు. ఎంపీవో మాట్లాడుతూ మండల గ్రామాల తాగునీటి సమస్యలు, పారిశుద్ధ్య అంశాల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమన్వయంతో పాటు పారదర్శక పాలన అందించేందుకు కట్టుబడి ఉంటానని తెలిపారు.




## షీ టీం ఆధ్వర్యంలో మహిళల భద్రతపై అవగాహన సదస్సు

**లక్సెట్టిపేట, నవంబర్ 12, ప్రభాతవార్త**

రామగుండం సిపి ఆదేశాల మేరకు మంచిర్యాల జిల్లా షీ టీమ్ వారు లక్సెట్టిపేట నందు గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదసు నిర్వహించడం జరిగినది. అందులో భాగంగా షీ టీం సభ్యులు మాట్లాడుతూ... మహిళల భద్రత, ఆన్లైన్ మోసాలపై, యాంటీ డ్రగ్స్, ఎవరైనా చెడు గా మాట్లాడిన, ప్రవర్తించిన తల్లిదండ్రులకు చెప్పాలని, వాటి నుంచి ఎలా బయటపడటం పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళల రక్షణ కోసం ప్రతి రోజు బస్టాండ్, ప్రధాన చౌరస్తాలో జన సమీకరణ ప్రాంతాల్లో కాలేజీల వద్ద షీ టీం నిరంతరంగా ఉంచడం జరుగుతుందని, ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు విద్యార్థులు భయపడకుండా 6303923700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. ఫోన్ చేసిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని స్పష్టం చేశారు. అలాగే అత్యాశకు పోయి సైబర్ క్రైమ్ ఆన్లైన్ మోసాలు, లోన్ యాప్స్ గురవుతున్నారని వాటికి జోలికి పోకుండా ఉండాలని, ఎవరైనా ఆన్లైన్ మోసాలకు గురైతే సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి సమాచారం ఇవ్వాలని, అలాగే మహిళలకు ఏదైనా ప్రమాదం ఉన్నట్లయితే, బెదిరింపులకు గురైతే వెంటనే 100 నంబర్ కు డయల్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ సభ్యులు శ్రవణ్, జ్యోతి, పాఠశాల హెడ్ మాస్టర్, టీచర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## రైలు ఢీకొని కూలి మృతి

**బెల్లంపల్లి, నవంబర్ 12, ప్రభాతవార్త**



బెల్లంపల్లిలో ప్రత్తి చేనులో ప్రత్తి ఏరడానికి వచ్చిన రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఒక యువకుడు రైలు ఢీకొని కూలి మృతి చెందాడు. బెల్లంపల్లి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివారాల ప్రకారం బల్వంత్ బిచ్చి (45) అనే యువకుడు రాజస్థాన్ రాష్ట్రంలోని జొన్న కేరా పహార్ గ్రామం నుంచి 20 రోజుల క్రితం బెల్లంపల్లి మండలం కన్నాల గ్రామంలో ప్రత్తి ఏరడానికి కూలి పని చేయడానికి బెల్లంపల్లికి వచ్చాడని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. పత్తి ఏరడానికి కూలీలుగా వచ్చారని మంగళవారం రాత్రి 10 గంటలకు టాయిలెట్ కని ఇంట్లో భార్య బిందకు చెప్పి రైల్వే ట్రాక్ వైపుకు వెల్లాడని తెలిపారు. అతను ఎంతకు రాకపోయేసరికి రాత్రంతా సంబంధీకులు వెతికారని పేర్కొన్నారు. బుధవారం ఉదయం 8 గంటల సమయంలో రైల్వే ట్రాక్ వద్ద ఏదో గుర్తుతెలియని ఎగువ రైలు బండి ఢీకొని మృతి చెంది ఉంటాడని హెడ్ కానిస్టేబుల్ తెలిపారు. జీఆర్పీ ఎస్ఐ మహేందర్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా మృతునికి భార్య బింద, ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు, తండ్రి ఉన్నారని తెలిపారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

### జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్

**ఆసిఫాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త :**


ధాన్యం కొనుగోలు కేంద్రంలో పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ డేవిడ్

రైతు సంక్షేమంలో భాగంగా జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్ అన్నారు. బుధవారం జిల్లాలోని రెబ్బెన మండలం నారాయణపూర్, కొమురవెల్లి గ్రామాలలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు మద్దతు ధర చెల్లించి నాణ్యమైన ధాన్యాన్ని నిబంధనల ప్రకారం కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కొరకు 40 కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ప్రతి కొనుగోలు కేంద్రంలో రైతుల కొరకు మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుండి ధాన్యం రాకుండా చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించి నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

## మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న సిబ్బంది పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త**

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఔట్సోర్సింగ్, థర్డ్ పార్టీ సిబ్బందికి పెండింగులో ఉన్న వేతనాలను చెల్లించాలని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ కోరారు. బుధవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కాంట్రాక్టు వ్యవస్థను రద్దుచేసి ప్రభుత్వమే కార్పొరేషన్ ద్వారా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలో పనిచేస్తున్న సిబ్బందికి పెండింగ్లో ఉన్న వేతనాలు చెల్లించడంతో పాటు కనీస వేతనం రూ.26,000, ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి ఇతర సమస్యలను పరిష్కరించాలని పలు డిమాండ్లు చేశారు. జిల్లాలోని మెడికల్ కాలేజీలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న సిబ్బందికి కనీస వేతనం అమలు చేయకపోవడంతో శ్రమ దోపిడీకి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ఉపాధ్యక్షుడు చిరంజీవి, కోశాధికారి నగేష్ తోపాటు మెడికల్ కాలేజ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించిన విద్యార్థులు

**పెంచికల్ పేట్, నవంబర్ 12, ప్రభాతవార్త**



మండలంలోని బొంబాయిగూడ ఉన్నత పాఠశాల 4,5,6 తరగతుల విద్యార్థులు బుధవారం విద్యాపర్యటనలో భాగంగా తహసీల్దార్, ఎంపిడిఓ కార్యాలయలు, పోలీస్ స్టేషన్, బ్యాంక్, ఎంఆర్సి కార్యాలయాలను సందర్శించారు. విద్యార్థులు ప్రభుత్వ వ్యవస్థలు ఎలా పనిచేస్తాయో ప్రత్యక్షంగా చూసి తెలుసుకున్నారు. అధికారులు విద్యార్థులకు తమ విభాగాల పనితీరును వివరించారు. తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది భూమి రికార్డులు, ఆదాయ ధృవపత్రాల జారీ విధానం గురించి వివరించగా, పోలీసులు చట్టం, శాంతి భద్రత, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. బ్యాంక్ లో డబ్బు జమ, తీసివేత, ఆన్లైన్ సేవల విధానాన్ని విద్యార్థులు ఆసక్తిగా గమనించారు. ఎంపిడిఓ, ఎంఆర్సి కార్యాలయాల్లో గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ పర్యటనతో ప్రభుత్వ కార్యాలయాల పనితీరుపై విలువైన అవగాహన పొందినట్లుగా విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమములో ఉపాధ్యాయులు జాపర్, అనిల్ పాల్గొన్నారు.

## క్విజ్ పోటీలు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయి

**తాండూర్, నవంబర్ 12, ప్రభాతవార్త**

క్విజ్ పోటీలు విద్యార్థుల్లో వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయనిసత్యమేవ జయతే ఫౌండేషన్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆశం అశోక్, కుమురం భీం జిల్లా ఇంచార్జి మూలమటం శివ ప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల విద్యార్థులకు బుధవారం సత్యమేవ జయతే ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్విజ్, వ్యాసరచన, వక్తృత్వం, పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగావారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు వివిధ రంగాలలో పోటీ తత్వాన్ని అలవర్చుకుంటేనే వ్యక్తిత్వ వికాసం, సమాజానికి మార్గదర్శకులుగా ఎదగడానికి దోహదం చేస్తాయన్నారు. ప్రతి ఒక్కరికి సత్యం, ధర్మం, కృషి విజయానికి మూలమని, నిజాయితీ, కృషి మార్గంలో నడిస్తేనే భారత భవిష్యత్తు బలపడుతుందన్నారు. విద్య కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాదని, పుస్తకాలకతీతంగా ఆలోచించే విద్యార్థినులే దేశ భవిష్యత్తు నిర్ణయిస్తారని అన్నారు. విద్యార్థుల్లో సేవాస్ఫూర్తి, దేశభక్తి పెంపొందించడమే సత్యమే జయతే ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమన్నారు. ధర్మప్రచారకులు వేణు గోపాల్‌రావు విద్యార్థులకు వివిధ అంశాలలో మార్గనిర్దేశం చేశారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేజీబీవీ ఇంచార్జి కవిత, ఉపాధ్యాయినులు, విద్యార్థినులు పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న ఆశం అశోక్

# సదరం శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఆసిఫాబాద్, నవంబర్ 12, ప్రభాతవార్త :**

దివ్యాంగులకు నిర్వహించే సదరం, యూడిఐడి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ అధికారి దత్తారాం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 నుండి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రారంభమయ్యే సదరం క్యాంపులో ఈనెల 14 నుండి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో14వ తేదీన మూగ, చెవిటి, 17న కంటిచూపు, 18న మానసిక వైకల్యం, 21న ఎముకలు, 25వ తేదీన రక్తస్రావ రుగ్మత, సికిల్ సెల్, తలసేమియా, హిమోఫిలియాకు సంబంధించిన వైద్య పరీక్షలు నిర్వహించబడునని పేర్కొన్నారు. క్యాంపుకు హాజరయ్యే ముందు ప్రాథమిక ఆరోగ్య సేవా కేంద్రంలో (పిహెచ్సి)లలో వికలత్వ పరీక్ష చేయించుకొని స్లాట్ బుక్ చేసుకొన్న తర్వాత సంబంధిత తేదీల్లో శిబిరానికి హాజరు కావాలని సూచించారు. అదే విధంగా శిబిరానికి హాజరయ్యే వారు తమ వెంట వికలత్వ ఆరోగ్య పరీక్ష చేయించుకొన్న పత్రాలతో, కోవిడ్ నిబంధనలను పాటిస్తూ హాజరు కాగలరని తెలిపారు.

# ప్రభుత్వం అందించే ప్రతి పైసా ప్రజా ప్రయోజనార్థం వినియోగించాలి

(మొదటిపేజీ తరువాయి)

వేగవంతం కావాలంటే స్థానిక సంస్థల ఆర్థిక స్థితి బలోపేతం కావడం అత్యవసరమని తెలిపారు. నిధుల వినియోగం పారదర్శకంగా, సమర్థవంతంగా ఉండాలని, పంచాయతీలు, మున్సిపాలిటీలు ప్రజల ప్రాథమిక అవసరాలపై దృష్టి పెట్టి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర నిధుల ద్వారా గ్రామ పంచాయతీలను బలోపేతం చేయాలన్నారు. ప్రజాస్వామ్యం ఫలాలు సామాన్య ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి రూపాయి ప్రజా ప్రయోజనానికి వినియోగించబడాలని పేర్కొన్నారు. వ్యవసాయం, పశుసంవర్ధక, మత్స్య పరిశ్రమ, అటవీ, చిన్నతరహా పరిశ్రమలు, విద్య, ఆరోగ్యం, మహిళా, శిశు సంక్షేమం వంటి రంగాలు గ్రామీణ ఆర్థికాభివృద్ధికి పునాదులని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో, సమగ్ర ప్రణాళికతో పనిచేస్తే స్థిరమైన గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ మార్గదర్శకాల ప్రకారం స్థానిక సంస్థల ఆర్థిక స్థితిగతులను బలోపేతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చైర్మన్ సూచించారు. అనంతరం ఉమ్మడి జిల్లా పరిధిలోని పంచాయతీల ఆదాయం, వ్యయాల స్థితి, పన్నుల వసూళ్లు, నిధుల వినియోగం, పేదరిక నిర్మూలన, గ్రామీణ గృహనిర్మాణం, విద్యుత్, తాగునీటి సరఫరా, రహదారులు, పారిశుద్ధం వంటి అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్ర వివరాలు అందజేశారు. ఈ సమావేశంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ, నిర్మల్ జిల్లాకు వివిధ శాఖలకు ఆయా రూపాలలో వచ్చిన నిధులు, ఆదాయ వివరాలను ఫైనాన్స్ కమిషన్ చైర్మన్‌కు వివరించారు. సమకూరుతున్న ప్రతి రూపాయిని ప్రజాప్రయోజనార్థం వినియోగిస్తున్నట్లు తెలిపారు. జిల్లా గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలలో వివిధ మార్గాలలో ఆదాయ పెంపునకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రజా ప్రయోజనార్థం వినియోగిస్తున్న నిధులకు సంబంధించి, సంబంధిత అధికారులతో ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ నిధుల వినియోగం పారదర్శకంగా జరిగేలా చర్యలు చేపట్టామని అన్నారు. తెలిపారు. అనంతరం రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, సభ్యులు రమేష్, కార్యదర్శి కాత్యాయిని దేవిలను అధికారులు శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు రాజర్షి షా, కుమార్ దీపక్, వెంకటేష్ దోత్రే, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు సోమ రాజేశ్వర్, ఫైజాన్ అహ్మద్, దీపక్ తివారి, పంచాయతీ రాజ్, శాఖ అధికారులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికేట్ అందజేస్తున్న పంచాయతీ కార్యదర్శి

## సులభంగా మ్యారేజ్ సర్టిఫికెట్

సారంగాపూర్, నవంబర్ 12, ప్రభాతవార్త:

ప్రజా పాలనలో మ్యారేజ్ సర్టిఫికేట్‌లను గ్రామంలోనే అందించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని సారంగపూర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా మండల కోఆర్డినేటర్ సాక్‌పెల్లి సురేందర్ అన్నారు. బుధవారం ఇటీవలే పెళ్ళి చేసుకున్న తాండ్ర(జి) గ్రామానికి చెందిన అశ్విత సురేష్ దంపతులకు ఆ గ్రామానికి చెందిన పంచాయతీ కార్యదర్శి సౌందర్య మ్యారేజ్ సర్టిఫికేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సాక్‌పెల్లి సురేందర్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో మ్యారేజ్ సర్టిఫికెట్ కోసం మీసేవ చుట్టు తిరిగేవారని ఇప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ గ్రామంలో ఎక్కడ పెళ్లి చేసుకున్న అదే గ్రామంలో మ్యారేజ్ సర్టిఫికెట్ ఇవ్వాలని నిర్ణయించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు వడ్లకొండ నర్సయ్య, తోకల అంజి కుమార్, నాకిడి రవి, నాకీడి చిన్న భూమేష్ ఉన్నారు.

# పెన్షనర్లు ప్రతి ఏడాది నవంబర్ నెలలో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలి

## శ్రీరాంపూర్ జీఎం మునిగంటి శ్రీనివాస్

నస్పూర్, నవంబర్ 12, ప్రభాతవార్త

పదవీ విరమణ పొందిన సింగరేణి ఉద్యోగులు ప్రతి ఏడాది నవంబర్ నెలలో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ అన్నారు. బుధవారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో సింగరేణి మాజీ ఉద్యోగుల కొరకు పెన్షనర్స్ లైఫ్ సర్టిఫికెట్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్, సీఎంపీఎఫ్ కమిషనర్ హరి పచౌరి, అసిస్టెంట్ కమిషనర్ గోవర్ధన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీరాంపూర్ జీఎం మాట్లాడుతూ, పెన్షనర్లు ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో లైఫ్ సర్టిఫికెట్ సమర్పించాలని, లైఫ్ సర్టిఫికెట్ నవంబర్ నెలలో సమర్పించకపోతే పెన్షన్ చెల్లింపులో ఇబ్బందులు తలెత్తుతాయని, రిటైర్డ్ ఉద్యోగుల సౌకర్యార్థం లైఫ్ సర్టిఫికెట్ శిబిరం నిర్వహించినట్లు పేర్కొన్నారు. సీఎంపీఎఫ్ కమిషనర్ హరి పచౌరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉమంగ్ మొబైల్ యాప్ ద్వారా ఉద్యోగులు వారు ఎక్కడ ఉన్నా వారి యొక్క లైవ్ సర్టిఫికెట్‌ను ఆన్‌లైన్‌లో సమర్పించవచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పెన్షనర్లకు ఉమాంగ్ యాప్ లైఫ్ సర్టిఫికెట్ ఎలా పొందాలో అవగాహన కల్పించి, వారికి లైఫ్ సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్వోటు జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, ఇంచార్జ్ డిజిఎం పర్సనల్ ఎం. రాజేష్, డీవైపీఎం కిరణ్ కుమార్, సీనియర్ పీవోలు ఎస్. సురేందర్, బి. మురళి, గనుల సంక్షేమ అధికారులు, సీఎంపీఎఫ్ సిబ్బంది పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్

## ప్రజలకు పాస్ట్ ట్యాగ్‌తో ఇబ్బందిలు పెట్టకూడదు

### పాస్ట్ ట్యాగ్‌ను తీసివేయాలి... ఎమ్మెల్యే వెడ్మ భోజ్జు పటేల్

ఉట్నూర్, ప్రభాతవార్త:



స్థానికుల నెంబర్లు అప్లోడ్ చేయకుండా స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించకుండా ఉట్నూర్ మండలం కొత్తగూడ ఫారెస్ట్ చెక్ పోస్ట్ వద్ద ఫాస్టాగ్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిన వెంటనే అక్కడకు ఎమ్మెల్యే చేరుకుని అధికారులతో మాట్లాడి వెంటనే నిబంధనల మేరకు వ్యవహరించి ఖానాపూర్ ప్రజలకు టోల్ మినహాయింపు ఇవ్వాలని ఆదేశించిన్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ నిబంధనలు పాటించకుండా ప్రజాప్రతినిధులకు తెలియకుండా ఇలా ప్రజలను ఇబ్బంది పెట్టే చర్యలు మరోసారి పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డి యఫ్ఓను ఆదేశించారు. వెంటనే పాస్టట్యాగ్‌ను తీసివేసి ప్రజలకు ఇబ్బందిలు కల్గకుండా చూడాలని కోరారు.

## మత్స్యకారుల అభివృద్ధి కొరకు ఉచితంగా చేప పిల్లల పంపిణీ

### రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

జైపూర్, నవంబర్ 12, ప్రభాతవార్త



మత్స్యకార సంఘాలు, మత్స్యకారుల అభివృద్ధి కొరకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపట్టిందని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. బుధవారం జిల్లాలోని భీమారం మండలం గొల్లవాగు ప్రాజెక్టులో మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం 100 శాతం రాయితీపై రిజర్వాయర్లు, చెరువులు, వాగులు, కుంటలలో ఉచితంగా చేప పిల్లలు విడుదల చేస్తుందని తెలిపారు. చేపలు తినడం ద్వారా శరీరానికి కావలసిన ప్రోటీన్స్ అందుతాయని, ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి కట్టుబడి ఉందని తెలిపారు. చెన్నూరు ప్రాంతంలో మోడల్ ఫిష్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తామని, భీమారం మండలంలో మత్స్యకార సొసైటీ కొరకు భవనం నిర్మించడం జరిగిందని తెలిపారు. ఫిష్ మార్కెట్, విద్యుత్ లైన్స్ ఏర్పాటు, చెరువు పూడికతీత, చెరువులో చెట్ల తొలగింపు అంశాలు మంత్రి దృష్టికి తీసుకురాగా సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రాంగ్ రూట్లో ప్రయాణం ప్రాణాలతో చెలగాటం

ఇచ్చోడ,12 నవంబర్, ప్రభాతవార్త:

*మండల కేంద్రంలోని బైపాస్ నుండి భారత్ పెట్రోల్ బంక్ పైపు వెళ్లే 44 వ జాతీయ రహదారిపై కొన్ని వేల సంఖ్యలో భారీ వాహనాలు ప్రయాణిస్తూ రహదారి మార్గం చాలా రద్దీగా ఉంటుంది. ఇలాంటి సందర్భంలో ద్విచక్ర వాహన చోదకులు పెట్రోల్ బంక్ వైపుగా రాంగ్ రూట్లో ప్రయాణం కొనసాగించడం వల్ల రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనాల కాంతి వలన భారీ వాహనాలు నడిపే డ్రైవర్లు అయోమయానికి గురై వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉంది. ఇలా అనేక సందర్భాల్లో వాహనాలు అదుపుతప్పి అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి. అయినా కానీ ద్విచక్ర వాహన చోధకులుఅదే వైఖరి కొనసాగిస్తున్నారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా సంబంధిత అధికారులు సకాలంలో స్పందించి సీసీ కెమెరాలు అమర్చి పర్యవేక్షించి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.*

